


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 109 -

## జీనత్ బేగం కథ

**చిన్న రేకుల గది అది.** దానికి అటాచ్డ్ బాత్ రూం, ఒక పక్క కిచెన్ గట్టు వున్నాయి. ఇరుకైనా తప్పదు కనుక ఆరుగురు అమ్మాయిలు అందులోనే తలదాచుకుంటున్నారు. పగలు షాపులో పనిచేసి అలసిపోయి వస్తారు. సాయంత్రం కలిసి వంట చేసుకుని తింటారు. రాత్రి పూట పరుపులు కింద వేసుకుని పడుకుంటారు.

పక్కనే వున్న ఇంట్లో మేడం జీనత్ బేగం వుంటుంది. ఆ ఇల్లు ముఖమల్ తివాచీలతో, అన్ని సౌకర్యాలతో ఇంద్రభవనంలా వుంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే రాజభోగం జీనత్ ది.

సెలవురోజుల్లో జీనత్ బేగం కాళ్ళు పట్టడం, వంటికి నూనె పట్టించి మసాజ్ చెయ్యడం, ఇల్లు శుభ్రం చేసి, తోటపని చూడటం లాంటివి కూడా ఈ అమ్మాయిలే చెయ్యాలి.

❦❦❦

కువైట్ సిటీకి నడిబొడ్డున వుంది ఆ ఇల్లు. ఆ ఇంటి వెనక వైపున వున్న కారు షెడ్డుకు అడ్డుగా నాలుగు రేకులు వేసి ఒక గదిగా తయారు చేసి ఈ అమ్మాయిలను వుంచింది జీనత్ బేగం. వాళ్ళని అదిలిస్తూ, బెదిరిస్తూ, తిడుతూ అదుపులో పెట్టుకుని సేవలు చేయించుకుంటుంది. ఆ ఇంటికి ఆమె మహారాణి. వాళ్ళు ఆమెకు సేవకురాళ్ళు. నక్కను తొక్కి వచ్చిందేమో జీనత్. అందుకే అరబ్ దేశంలో ఆమె హవా అలా కొనసాగుతోంది.

❦❦❦

చాలా కాలంగా ఆ ఇంట్లో నివసిస్తోంది జీనత్ బేగం. ఆ ఇల్లు ఆమె కార్యకలాపాలకు, విందు వినోదాలకు అడ్డాగా మారిపోయింది. కువైట్ లో సేట్ల దయవుంటే ఏదైనా సాధ్యమే. ఇల్లే కాదు ఉప్పు, పప్పు, బియ్యం, చక్కెర, నూనె, పాల డబ్బాల్లాంటి సరుకులన్నీ సేట్ల ఇండ్లనుండే వస్తాయి.

ఆమెకు బి.ఎం.డబ్ల్యూ కారుంది. ప్రత్యేకంగా కారు డ్రైవరు, ఇద్దరు పనివాళ్ళు కూడా వున్నారు. కువైట్ సేట్ల భార్యలు అనుభవించే వైభోగాన్ని, విలాసవంతమైన జీవితాన్ని జీనత్ స్వంతం చేసుకుంది.

కువైట్ లాంటి పరదేశంలో అంత లోతుకు పాతుకుపోయి స్థిరపడి అష్టైశ్వర్యాలు అనుభవించడం కష్టమే. కానీ జీనత్ బేగం తెలివైనది. అసాధ్యాలను సుసాధ్యాలుగా చేయగలదు. సమస్యలను సైతం తనకు సానుకూలంగా మలచుకోగలదు. మాయ మాటలతో సేటులను బుట్టలో వేసి ఆడించగల దిట్ట ఆమె. అంతేకాదు అద్భుతమైన సౌందర్యరాసి జీనత్ బేగం. తన అందంతో ఎంతటి వాడినైనా వశపరుచుకోగలదు.

జీనత్ బేగం తన చిన్న వయసులోనే శ్రీలంక నుండి కువైట్ కు వచ్చి స్థిరపడి పోయింది. ఇరవైయేళ్ళుగా కువైట్ సిటీలోని ఆ ప్రాంతంలో చోటామోటా వ్యాపారాలను, ఆర్థిక లావాదేవీలను కొనసాగిస్తూ ఆ చుట్టు పక్కలవున్న వ్యాపారులను ఆమె శాసిస్తోంది. జీనత్ పేరు వింటేనే అమ్మో లేడీ డాన్ అంటూ భయపడతారు జనాలు. దీనికి కారణం ఆమెకున్న కువైట్ సేట్ల అండ. కఠినమైన మనస్తత్వం. ముఖ్యంగా సేటు బిలాల్ కు ఆమె ప్రియురాలని చెప్పుకుంటారు. ఆ ఇల్లు, కారు, షాపులు కూడా ఆయనే జీనత్ కు బహుమతిగా ఇచ్చాడని అంటారు. అంతేకాదు ఆమె చేయని వ్యాపారం లేదు. తొక్కని అడ్డదారి లేదు. ఏదైనా సాగినంత కాలమే. ఆ సంగతి తెలియక మనుషులు గర్వంతో విర్రవీగుతుంటారు.

నేను మంచిదాన్ని కాదు, ఎవరైనా సరే నా దారికి అడ్డు వస్తే సహించను. డబ్బు సంపాదనే నా ధ్యేయం అని ఆమె గురించి ఆమే స్వయంగా, ధైర్యంగా, గర్వంగా చెప్పుకుంటుంది. ఈ మధ్యనే కొత్తగా మాలియాలో ఒక బట్టల షాపు తెరిచిందామె. అందులో పని చెయ్యడానికి ఆ ఆరుగురు అమ్మాయిలను ఇండియానుండి రప్పించింది జీనత్ బేగం. అదే ఆమె చేసిన తప్పు. ఇరవైయేళ్ళుగా మహరాణిలా బ్రతుకుతున్న జీనత్ బేగం పతనానికి ఇక్కడే తొలి అడుగు పడింది.

ప్రతి కథకు ఎక్కడో ఒక చోట ముగింపు వుంటుంది. ఒక్క పొరపాటు జీవితాన్ని అధ:పాతాళానికి తోసేస్తుంది.

ఆ రోజు శుక్రవారం. అరబ్ దేశాల్లో మధ్యాహ్నం నమాజ్ అయ్యాక అందరికీ ఆట విడుపే. సాయంత్రం అరబ్ షేకులందరూ దువానియాలో సమావేశమై గహ్వా తాగుతూ, హుక్కా పీలుస్తూ, అందమైన అమ్మాయిల బెల్లీ డ్యాన్సులతో ఆనందంగా కాలం గడుపుతారు. ఆరోజు సాయంత్రం అనుకోకుండా సేటు బిలాల్ జీనత్ బేగం దగ్గరికి వచ్చాడు.

ఆ సమయంలో ఆరుగురు అమ్మాయిలు జీనత్ బేగం ఇంటి ముందు తోటపని చేస్తున్నారు. వారందరిలో సుష్మ

అనే అమ్మాయి ప్రత్యేకంగా చుక్కల్లో చంద్రునిలా వెలిగిపోతోంది. కారు దిగి ఇంట్లోకి నడిచి వచ్చేవాడల్లా ఆ అమ్మాయిని చూసి అక్కడే ఆగిపోయాడు సేటు బిలాల్.

సౌందర్యారాధకులు అరబ్ షేకులు. ముఖ్యంగా స్త్రీల అందానికి దాసోహమైపోతారు. అతడి అడుగులు ముందుకు కదలనని మొరాయించాయి.

"ఏయ్ అందాల బొమ్మా.. ముద్దుగున్నావ్.. నీ పేరేంటి" ప్రశ్నించాడు సేటు బిలాల్ నవ్వుతూ.. బిత్తరపోయింది సుష్మ.

ఆజానుబాహుడు, అరవింద దళాక్షుడు సేటు బిలాల్. ఇరవైయేళ్ళ లేత కొమ్మ సుష్మ సేటు వైపునుండి చూపులు మరల్చుకుంది. భయపడుతూ బెరుకుగా, తడబడే స్వరంతో "సలాం సేటూ.. నా పేరు సుష్మ" అంది తలవంచుకుని.

ఇంతలో అలికిడి విన్న జీనత్ బేగం హొయలొలికిస్తూ విలాసంగా నడుస్తూ బయటికి వచ్చింది. అక్కడ సేటు బిలాల్ సుష్మతో మాట్లాడటం గమనించి నచ్చనట్లు నొసలు చిట్లించింది. వెంటనే "హబీబి తాల్ దాఖల్" అంటూ చేయి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది. అన్యమనస్కుడైన సేటు లోనికెళ్ళి కూర్చున్నాడే కానీ మనసంతా సుష్మ మీదే వుంది. ఆయన మూడ్ ని గమనించలేనంత అవివేకి కాదు జీనత్ బేగం. ఆయన దృష్టిని తన వైపు ఎలా మరలించుకోవాలో తెలిసిన నెరజాణ జీనత్. ఆ ప్రయత్నాల్లో పడిందామె. కానీ మొదటిసారి సఫలం కాలేకపోయింది. సేటు లేచి "చల్లగాలి కావాలి పద" అంటూ మరలా తోటలోకి వచ్చాడు.

అక్కడ పచార్లు చేస్తూ సుష్మనే చూస్తూ "హేయ్ జీనత్ ఆ అందమైన పిల్ల నాకు కావాలి" అన్నాడు ఏదో ఆటబొమ్మ కావాలన్నట్లు. జీవితంలో మొదటిసారి జీనత్ గుండెలో ప్రకంపనలు మొదలయ్యాయి. కట్టుకున్న కోటగోడలు బీటలు బారినట్లు అనిపించి "అమ్మాయిలూ తోటపని ఇక చాలు. మీరు మీ రూం కు వెళ్ళండి" అని హుకుం జారీ చేసింది.

❦❦❦

రెండ్రోజులు గడిచాయి. ఆ రోజు జీనత్ సిటీకి దూరంగా వున్న బ్యూటీ సెలూన్ కు వెళ్ళింది. ఆ సెలూన్ కు ఆమే ఓనర్. 10 మంది వర్కర్స్ తో అక్కడ బ్యూటీ పార్లర్ ను ఆమె నిర్వహిస్తోంది. జీనత్ లేదని తెలిసే సేటు ఇంటికి వచ్చాడు. కారు పోర్టికోలో ఆపి సరాసరి రేకుల గది ముందుకు వచ్చి "హేయ్ సుష్మా.." అని పిలిచాడు.

ఆ సమయంలో సుష్మ, రేఖ అనే ఇంకో అమ్మాయి ఇద్దరే రూములో వున్నారు. ఇద్దరూ తలవంచుకుని సేటు ముందు నిలబడ్డారు. ఇద్దరి తలకూ హిజాబ్ చుట్టి వుంది.

"ఇదేంటి, మొన్న లేదుగా" అడిగాడు ఆశ్చర్యపోతూ.

"మేడం జీనత్ తలకు ముసుగు వేసుకోమంది సేటూ" చెప్పింది రేఖ.

"ఓహో.. అలాగా. అదొక పిచ్చిది" అంటూ కళ్ళెగరేస్తూ లోనికొచ్చాడు.

"నువ్వు ఇంట్లోకి వెళ్ళి రెండు సాండ్విచ్ లు ఓ గ్లాసు నారింజ రసం పట్రా" చెప్పాడు రేఖతో.

"సరే సేటూ" అంటూ ఆ అమ్మాయి పక్కనున్న జీనత్ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఇప్పుడు సుష్మ ఒక్కటే ఆ గదిలో సేటు ముందు నిలబడింది.

సేటు చూపులు, మాటలు ఇబ్బందిగా అనిపిస్తున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయి.

"ఏయ్ సుష్మా ఇలా దగ్గరికి రా" అన్నాడు.

లేడిపిల్లలా భయపడుతూ కాస్త దగ్గరికి వచ్చింది.

నువ్వు కువైట్ కు ఎందుకొచ్చావ్ అన్నాడు.

"పేదవాళ్ళం కదా డబ్బు సంపాదించాలని వచ్చాను సేటూ" అంది వణుకుతూ.

జేబులోనుండి దినారాల కట్ట బయటికి తీసి "అయితే తీసుకో" అన్నాడు.

"వద్దు సేటూ" అంది.

"ఏం?" అన్నాడు.

మౌనంగా నిలబడింది ఆ అమ్మాయి.

"ఎందుకు వద్దు చెప్పు" రెట్టించాడు సేటు.

"ఊరికే వద్దు సేటూ. పని చేసి జీతం తీసుకుంటాను" అంది.

"ఓహో అయితే ఊరికే తీసుకోవద్దులే, ఇదిగో నా కాళ్ళు నొప్పిగా వున్నాయి. జీనత్ కు కాళ్ళు పడతావు కదా, అలాగే నా కాళ్ళు కూడా వత్తి పెట్టు. ఈ కట్ట ఇస్తాను" అన్నాడు నోట్ల కట్టను ముఖం ముందు ఆడిస్తూ.

"వద్దు సేటూ" అంది భయంగా.

"ఎందుకు వద్దు" అన్నాడు కోపంగా.

"జీనత్ బేగం నన్ను చంపేస్తుంది సేటూ" అంది.

భృకుటి ముడిచాడు సేటు.

"జీనత్..? "ఎందుకు చంపుతుంది..? అది నా పెళ్ళామా ఏమి? పెళ్ళామయినా కూడా మనల్ని ఏమీ చెయ్యలేదు. నలుగుర్ని నిఖా చేసుకోగలను నేను" తలెగరేసాడు సేటు.

భయంగా చూసింది సుష్మ.

చిరునవ్వు నవ్వాడు సేటు.

"దానికి భయపడకు సుష్మా. ఈ క్షణమే ఆ జీనత్ ను బయటకు పంపించి నిన్ను నా రాణిగా చేసుకోగలను నేను. రా.. దగ్గరికి రా" అన్నాడు చేతులు సాచి.

"వద్దు సేటూ. మీరు నా అన్న లాంటివారు నన్ను వదిలి పెట్టండి" అంది సుష్మ ప్రాధేయ పడుతూ.

"అన్నలాంటి వాడిని కానీ అన్నను కాను కదా. మీ భారతీయులకు పురుషులందరూ అన్నలు, నాన్నలే" అంటూ భళ్ళున నవ్వాడు సేటు.

"నువ్వు ఇక్కడ క్షేమంగా, సంతోషంగా వుండాలంటే నా మాట వినక తప్పదు సుష్మా" అన్నాడు కోపంగా.

ఇంతలో సాండ్విచ్ ప్లేటు జ్యూస్ గ్లాస్ తీసుకుని రేఖ అనే అమ్మాయి వచ్చింది. వెనకే జీనత్ బేగం కూడా పరిగెత్తుకుంటూ వచ్చింది.

వచ్చీ రాగానే "హబీబీ ఇక్కడ ఏం చేస్తున్నావ్" అంటూ సేటును అల్లుకుపోయి ముద్దులు కురిపించింది.

"జీనత్ ఈ పిల్ల నాకు కావాలి" గట్టిగా చెప్పాడు సేటు.

కలవరపడింది జీనత్."అలాగే హబీబీ. నేను చూస్తాను" అంటూ
వెంటనే సేటును అక్కడనుండి బయటికి లాక్కునిపోయింది జీనత్.

హమ్మయ్య గండం గడిచింది అని నిట్టూర్చింది సుష్మ.

కానీ అంతటితో ముగియలేదు కథ.

ఆ రాత్రి సుష్మకు కాళరాత్రి అయింది. తిరిగివచ్చిన జీనత్ సుష్మ మీదపడి ఇష్టం వచ్చినట్లు కొట్టింది, గోళ్ళతో ముఖమంతా రక్కింది. రాత్రంతా ఆ హింసను భరించలేకపోయింది సుష్మ. ఆ తిట్లు వినలేకపోయింది. అంతా సుష్మదే తప్పని, డబ్బుకోసం సేటును వలలో వేసుకుందని నిందించింది. మర్యాదగా సేటుకు దూరంగా వుండకపోతే ముఖం మీద యాసిడ్ పోసి అందాన్ని నాశనం చేస్తానని బెదిరిస్తుంటే భయంతో వణికిపోయింది సుష్మ.

మరుసటిరోజు ఉదయాన్నే సెలూన్ కు తీసుకెళ్ళి సుష్మకు గుండు కొట్టించింది జీనత్. సుష్మను తీసుకెళ్ళి బేస్మెంట్ లో వున్న గదిలో పడేసి వేళకు కొన్ని రొట్టె ముక్కలు పెట్టమని, గది తాళం తీయొద్దని అమ్మాయిలతో చెప్పింది. పిచ్చివేషాలు వేస్తే చంపి ఎడారిలో పూడ్చి పెడతానని సుష్మకు వార్నింగ్ ఇచ్చింది.

కసి, కోపం, తెగింపు జీనత్ కళ్ళలో కనబడ్డాయి.

ఏడుస్తూ నిస్సహాయంగా గుండును తడుముకుంది సుష్మ.

సాయంత్రం యథావిధిగా సేటు సుష్మ కోసం వచ్చాడు.

రాగానే "సుష్మ ఏది?" అని జీనత్ ను అడిగాడు.

గతుక్కుమంది జీనత్.

"అది ఇంటినుండి పారిపోయింది సేటూ. ఎక్కడికెళ్ళిందో తెలియదు. ఉదయం నుండి వెతుకుతున్నాను" అంది నంగనాచిలా ముఖం పెట్టి.

సేటు దాని మాటలు నమ్మలేదు.

అమ్మాయిలను రెట్టించి అడిగాడు.

ఒక అమ్మాయి నోరు జారి నిజం చెప్పేసింది.

వెంటనే బేస్ మెంట్ కు వెళ్ళి సుష్మను ఆ పిల్ల వంటి మీద వున్న గాయాలను చూసాడు. చలించిపోయాడు సేటు.

అంతే.. పట్టరాని కోపంతో లాగి పెట్టి జీనత్ చెంప మీద బలంగా కొట్టాడు. గిరగిరా తిరుగుతూ నేలమీద పడింది జీనత్.

ఆమె చేతిలోని ఇంటి తాళాలు లాక్కుని "హేయ్ కుక్కా.. నేను ఇష్టపడిన ఈ అమ్మాయిని కొట్టి, తలకు గుండు కొట్టించడానికి నీకెంత ధైర్యం. నువ్వెంత, నీ బ్రతుకెంత పోవే.. పో.. జన్మలో నీ ముఖం నాకు చూపించకు" అంటూ బయటికి తోసాడు.

జీనత్ కాళ్ళావేళ్ళా పడి బ్రతిమిలాడినా కరగలేదు సేటు హృదయం.

"పిచ్చి వేషాలు వేస్తే పోలీసులను పిలిచి జైల్లో తోయిస్తా" అన్నాడు సేటు.

మొదటిసారి జీనత్ మొహంలో భయం కనబడింది. కనికరం కలిగినా, కోపమొచ్చినా కువైట్ సేటులను పట్టలేము. అలా మహారాణిలా బ్రతికిన జీనత్ బేగం రోడ్డున పడింది. కట్టు బట్టలతో నిలబడి చిన్న పనికోసం అందరినీ ప్రాథేయపడ సాగింది. పూలమ్మిన చోటే కట్టెలమ్మడం అంటే ఇదేనేమో.

జీనత్ నిర్వహించే వ్యాపారాలన్ని సేటు పేరుతోనే వున్నాయి. అక్కామా కూడా ఆయనదే కాబట్టి క్షణంలో సమస్తం కోల్పోయింది జీనత్.

ఇంటి తాళాలను సుష్మ చేతికి అందించాడు సేటు. "ఇప్పటినుండీ ఈ ఇల్లు నీది. ఈ వ్యాపారాలన్నీ నీవి. అన్ని సౌకర్యాలు నీకు కల్పిస్తాను. నువ్వు సుఖంగా సంతోషంగా వుండు. నువు గుండుతో, గాయాలతో అందవికారంగా వున్నా కూడా నీ మీద ఇష్టం నాకు పోలేదు.

"ఊరికే దినారాల కట్ట తీసుకోనని పని చేస్తేనే జీతం తీసుకుంటా" అన్నావు కదా. అక్కడ నీ నిజాయితి నచ్చి నీతో ప్రేమలో పడిపోయాను నేను మీ భారతీయులు రామాయణాన్ని చదువుతారు కదా. అందులో రావణుడు సీతను ఎత్తుకొచ్చి నీకు నాపై ఇష్టం కలిగినప్పుడే నా దగ్గరికి రా అంటాడు. అలాగే నువ్వు కూడా నా మీద ఇష్టం కలిగినప్పుడే కరుణించు. అందాకా నిరీక్షిస్తాను" అన్నాడు సేటు.

భారంగా నిట్టూర్చింది సుష్మ.

కొన్ని కథలంతే. కొనసాగింపు తప్ప ముగింపు వుండదు. సుష్మ ఏం చేస్తుందో కాలమే నిర్ణయించాలి.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments